క్లుప్తంగా

ముమ్మరంగా జాతర పనులు



ఏటూరునాగారం: మండలంలోని కొండాయి, దొడ్ల, ఐలాపురం గ్రామాల్లో ఈనెల 12 నుంచి జరగబోయే జాతర కోసం చేపట్టిన పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు తెలిపారు. సోమవారం మండలంలోని కొండాయిలోని గోవిందరాజులు, సమ్మక్క, సారలమ్మ, ఐలాపురంలోని సమ్మక్క సారలమ్మ గద్దెల చుట్టూ ప్రహరీ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో గుడ్ల దేవేందర్, వసంత శ్రీనివాస్, ముక్కెర లాలయ్య, వావిలాల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పశువుల పట్టివేత

ఏటూరునాగారం: మండలంలోని అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్లు ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మండల కేంద్రంలోని అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద ఏఎస్‌ఐ సుబ్బారావు, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, అజయ్‌తో కలిసి వాహనాలు తనిఖీ చేపట్టారని తెలిపారు. ఏటూరునాగారం నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న బొలెరో వాహనం తనిఖీ చేయగా అందులో పశువులు ఒకదానిపై ఒకటి ఉన్నాయన్నారు. వాహనదారుడిని విచారించగా కరకగూడెం ప్రాంతానికి చెందిన దాసరి ప్రకాశ్, వరంగల్‌కు చెందిన ముజామిల్ కలిసి వాహనంలో పశువులను తరలిస్తున్నారన్నారు. వాహనాన్ని సీజ్ చేసి పశువులను హనుమకొండలోని రాంపూర్ గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

జీపీ ట్యాంకర్ బోల్తా..

సిబ్బందికి గాయాలు



ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపీ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. చెట్లకు నీళ్లు పోసేందుకు వెళ్తున్న క్రమంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో జీపీ సిబ్బంది గజ్జెల ఆశయ్య స్వల్పంగా గాయపడగా వైద్య చికిత్స కోసం ములుగు సివిల్ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన జీపీ సిబ్బందికి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మెరుగైన వైద్య సేవలందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టిఫిన్ బండిని ఢీ కొట్టిన వాహనం

ఇద్దరికి గాయాలు



ములుగు రూరల్: మొబైల్ టిఫిన్ బండిని బొలేరో వాహనం ఢీ కొట్టిన సంఘటన మల్లంపల్లి మండల కేంద్రంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మల్లంపల్లి గ్రామానికి చెందిన ఈర్ల రవి అతడి భార్య జ్యోతితో కలిసి ఇండ్లీ బండి నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. సోమవారం ఉదయం ఏటూరునాగారం వైపు నుంచి పశువుల లోడుతో వస్తున్న బొలేరో వాహనం టిఫిన్ బండిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రవికి తీవ్ర గాయాలు కాగా జ్యోతికి స్వల్ప గాయాలయ్యాయి. రవిని చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు. రవి అల్లుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టీ షర్ట్స్ అందజేత



పలిమెల: జిల్లా కేంద్రంలోని పోలీస్ శాఖ తరుపున నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొననున్న మండల క్రికెట్ జట్టు క్రీడాకారులకు ఎస్సై జంగిలి రమేశ్ ఆధ్వర్యంలో కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం టీ షర్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములు లెక్కచేయకుండా విలువలతో కూడిన ఆటను ప్రదర్శించాలన్నారు.

మండల కమిటీ ఎన్నిక

టేకుమట్ల: డీటీఎఫ్ మండల నూతన కమిటీని సోమవారం జిల్లా కౌన్సిలర్లు తిరుపతి, సుమన్, ఫహీమ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ వివరాలను వెల్లడించారు. అధ్యక్షుడిగా ఈదునూరి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా మోయిన్, ఉపాధ్యక్షులుగా కృష్ణ, సువర్ణరాణి, స్వామి, కార్యదర్శులుగా ప్రవీణ్, నాగరాజు, సుధాకర్, సురేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ సభ్యులు వాణి, రమేశ్ పాల్గొన్నారు.

అనుమతులే తరువాయి!

- మండలంలో ఆవిర్భవించనున్న కొత్త గ్రామ పంచాయతీ అరుణాచలపురం
- ప్రతిపాదనలు పంపించిన అధికారులు



మొరుమూరు గ్రామ పంచాయతీలోని అరుణాచలపురం గ్రామం

వాజేడు: మండలంలో ఇప్పటి వరకు 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కాగా,మరో గ్రామ పంచాయతీ కావాలని కోరుతూ ప్రజల కోరిక మేరకు ఉన్నతాధికారులు ప్రభుత్వానికి ప్రతి పాదనలను పంపించారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కొత్త గ్రామ పంచాయతీ రానున్నట్లు సమాచారం. అదే జరిగితే మండలంలోని మొరుమూరు గ్రామ పంచాయతీలో ఉన్న అరుణాచలపురం కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పడనుంది. దీంతో మండలంలో గ్రామ పంచాయతీల సంఖ్య 18కి చేరుకుంటుంది. వాజేడు మండలంలో ఉన్న గ్రామ పంచాయతీలో మొరుమూరు గ్రామ పంచాయతీ ఎక్కువ గ్రామాలతో పెద్ద పంచాయతీగా ఉంది. పంచాయతీల విభజన సమయంలో అధికారులు ఈ గ్రామ పంచాయతీని రెండుగా చేయక పోవడంతో 11 గ్రామాలతో ఒకే పంచాయతీగా ఉండి పోయింది.

1186 ఓట్లు, ఐదు ఊర్లు

మొరుమూరు గ్రామ పంచాయతీలో దాదాపు 3100 మంది జనాభా ఉండగా అందులో 2424 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పుడు రెండు గ్రామ పంచాయతీలుగా విడిపోతే కొత్తగా ఏర్పడే అరుణాచలపురం గ్రామ పంచాయతీలో అరుణాచలపురం, కొప్పుసూరు, గణపురం, గణపురం కాలనీ, మొట్లగుడెం ఐదు గ్రామాలు కలువనున్నాయి. ఈ గ్రామాల్లో సుమారుగా 1500 జనాభా 1186 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే మొరుమూరు గ్రామ పంచాయతీలో సుమారుగా 1600 మంది జనాభా 1238 మంది ఓటర్లు ఉండనుండగా ప్రగళ్ల పల్లి, మొరుమూరు, మొరుమూరు కాలనీ, బొల్లారం ఆరుగుంట పల్లి, బిజినే పల్లి గ్రామలు మొరుమూరు గ్రామ పంచాయతీలో ఉండనున్నాయి.

గ్రామ పంచాయతీ ఏర్పడాలి



మొరుమూరు గ్రామ పంచాయతీ చాలా పెద్దది. కొత్త గ్రామ పంచాయతీ మాకు అవసరం. కొత్తగా అరుణాచలపురం గ్రామ పంచాయతీ ఏర్పాటు చేస్తే మా పంచాయతీని పురోగతిలోకి తీసుకువెళ్తాం. - చిక్కుడు వెంకటేశ్వర్లు, అరుణాచలపురం

అభివృద్ధి చేసుకుంటాం..



కొత్తగా ఏర్పడ బోయే గ్రామ పంచాయతీని అదరం కలిసి అభివృద్ధి చేసుకుంటాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండాలంటే కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలి. - మడకం భీమయ్య, అరుణాచలపురం

ప్రతిపాదనలు పంపించాం

కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటు కోసం ఉన్నతాధికారుల సలహాలు, సూచనలతో ప్రతి పాదనలను పంపించాం. అరుణాచలపురం, ఘణపురం, ఘణపురం కాలనీ, మొట్ల గూడెం, కొప్పుసూరు గ్రామాలతో కొత్త పంచాయతీకి ప్రతి పాదనలను పంపాం.

- కార్తీక్, మొరుమూరు పంచాయతీ కార్యదర్శి

చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ సతీశ్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): ఆదివాసీ చట్టాలు అమలు చేయటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ చట్టాల అమలుకు ఉద్యమాలతోనే సాధ్యం అవుతుందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ చట్టాలను అమలు చేయటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ బాబు, నర్సింహారావు, రాంబాబు, శ్రీను, శంకర్ తదితరులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



వృద్ధుడికి పరీక్షలు చేయిస్తున్న జంపన్ననాయక్

ములుగు: జంపన్న చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు భూక్య జంపన్ననాయక్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 144 మంది హాజరుకాగా పరిశీలించిన వైద్యులు 44 మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉన్నట్లు హైదరాబాద్‌లోని శంకర ఐ ఆస్పత్రికి రెఫర్ చేశారు. శిబిరానికి మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ హాజరై వైద్యులకు తగిన సూచనలు చేశారు. నిరుపేదలకు వైద్య పరంగా తగిన చికిత్స అందించేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో గండారపు రాజుగంగపుత్ర, వీరబోయిన రాజేందర్‌ముదిరాజ్, బాదావత్ రాజ్‌కుమార్, అన్నారపు నాగార్జున, కన్నెబోయిన విక్రంయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, సతీశ్, మంగులాల్, కిట్టునాయక్, దేవేందర్, ప్రసాద్‌గౌడ్, నిరంజన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఏటూరునాగారం: మండల కేంద్రం పరిధిలోని ఆకులవారిఘణపురం ప్రాంతానికి చెందిన గంజి రంజిత్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో బాధిత కుటుంబానికి నేతాజీ ఫౌండేషన్ సభ్యుడు గజ్జెల సుమన్, సేవ్ ద లైఫ్ ఫౌండేషన్ సభ్యులు గొట్టిముక్కల చరితసాగర్, విశ్వతేజ దంపతులు, తోటి పెయింటర్స్ కలిసి సోమవారం రూ.12వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కిషోర్, రవి, దేవేందర్, అరుణ్, రాజు, కమలాకర్, సులేమాన్, శివ పాల్గొన్నారు.

నాగిరెడ్డి మృతి ఉద్యమానికి తీరని లోటు

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

గోవిందరావుపేట: సీపీఎం సీనియర్ నాయకుడు సామ నాగిరెడ్డి అకాల మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణా రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పస్రా గ్రామంలో సామనాగి రెడ్డి సంతాప సభ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తీగల ఆదిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా సూడి కృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. 40 సంవత్సరాలుగా నాగిరెడ్డికి పార్టీతో అనుబంధం ఉందని, ఆయన అనేక పోరాటాల్లో పాల్గొన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల వెంకట్ రెడ్డి, యానాల ఆనంత రెడ్డి, సోమ మల్లారెడ్డి, అంబాల పోషాలు, అంబాల మురళి, కె సదానందం, కృష్ణారావు, కవిత, రాజేశ్వరీ, సూర్యనారయణ, ఉపేంద్రచారి, రాజు, ఐలయ్య, సాంబయ్య, సువర్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహాసభకు తరలిరావాలి



వెంకటాపురం(ఎం): పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



గోవిందరావుపేట: పస్రాలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

- ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శ్యామ్

వెంకటాపురం(ఎం): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే వేల గొంతులు - లక్ష డప్పులు మహా ప్రదర్శన సభకు ప్రతీ మాదిగ తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కాడపాక శ్యామ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాలేసి కిరణ్, గడ్డమీది భాస్కర్, కుమ్మరి ప్రవీణ్, మామిడి నవీన్, బన్నీ, సుమంత్, జంపయ్య, రాహుల్, శివ, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: వేలగొంతులు-లక్ష డబ్బులు గోడ పత్రాలను మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు.ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చెన్నం స్వామి మాదిగ, చెన్నం ఎల్లయ్య, వేణుబాబు, బల్సుపాటి రాజు, లేగల నాగేష్, సాంబశివరావు, స్వామి, కీసరి రాజు, సమ్మయ్య, నర్సింహరావు ఉన్నారు.

సభకు మద్దతు

గోవిందరావుపేట: ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్షల డప్పులు-వేలాది గొంతుల మాదిగల మహాసభలో ప్రత్యక్షంగా పాల్గొని పూర్తి మద్దతు తెలుపుతామని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ అన్నారు. మండల పరిదిలోని పస్రా చౌరస్తాలోని కొమురం భీం విగ్రహం వద్ద తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింత కృష్ణ ఆధ్వర్యంలో వట్టం ఉపేందర్, ఎమ్మార్పీస్ నాయకులు కలిసి సంయుక్తంగా ర్యాలీ నిర్వహించి కరపత్రాలను ఆవిష్కరించారు. కొమురం భీం విగ్రహనికి పూలమాలలు వేసి, ఆదివాసుల డోలీలతో ప్రదర్శించారు. తుడుం దెబ్బ, ఎమ్మార్పీస్, ఎమ్మెస్పీ నాయకులు వట్టం జనార్ధన్, రమణాల లక్ష్మయ్య, పుట్ట రవి, కబ్బాక శ్రావణ్, ఎర్నే ధనుంజయ్, కొమురం లక్ష్మీకాంత, ఇరుగు పైడి, మడిపెల్లి శ్యాంబాబు, నెమలి నర్సయ్య, పుల్లూరు కరణాకర్, ముంజాల భిక్షపతి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తు సోమవారం మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు యాసం శ్రీను ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి నివేదిక అందించనున్న సమయంలో అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటన చేయటం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంతల సమ్మయ్య, అభినయ్, యాసం చరణ్, శేషు, గుద్దేటి విగ్నేష్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- మేకల మహేందర్



మాట్లాడుతున్న మేకల మహేందర్

ములుగు రూరల్: గ్రామీణ ప్రాంతాల ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఛీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. సోమవారం మండలంలోని రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎజెన్సీ చట్టాలు, ఉచిత న్యాయం పొందడం వంటి విషయాలను వివరించారు. కేన్సర్ కారకాలైన గుట్కా, పొగాకు, సిగరెట్లు వినియోగం తగ్గించాలని లేని పక్షంలో కేన్సర్ బారిన పడే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ప్రజలు వ్యాయామం తప్పకుండా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఛీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ స్వామిదాస్, రాచర్ల రాజ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, సత్యకుమారి, అన్నపూర్ణ, సుజాత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



ములుగు రూరల్: అరెస్టు చూపుతున్న అధికారులు



వెంకటాపురం(కె): స్వాధీనం చేసుకున్న గుడుంబా సామగ్రి

ములుగు రూరల్: గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ , ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం ములుగు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అబ్బాపూర్, మల్లంపల్లి, జాకారం, శ్రీరాములపల్లి, వెంకటాపురం(ఎం) మండలంలోని ఇంచెన్‌చెరువుపల్లి, మల్లంపల్లి, నల్లగుంట గ్రామాలలో స్టేట్ ఫోర్స్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాడుల్లో అలాగే 46 లీటర్ల నాటుసారా, 150 కేజీ చెక్కర, 4 కేజీల యేస్టు, 1300 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం చేసుకుట్ల వెల్లడించారు. పట్టుబడిన సామగ్రి సుమారు రూ. 5లక్షల విలువ చేస్తుందని అన్నారు. గుడుంబా అమ్మకాలు చేపడుతున్న 8 మందిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ లింగయ్య, ఎక్సైజ్ సీఐ సుధీర్, టాస్క్‌ఫోర్స్ సీఐ రాజసమ్మయ్య, ఎక్సైజ్ ఎస్సై లింగయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై రజిత, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బెస్తగూడెం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గుడుంబా స్థావరాలపై సోమవారం ఎస్సై తిరుపతిరావు ఆధ్వర్యంలో బెస్తగూడెం గ్రామంలో కార్డన్‌సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో తనిఖీలను నిర్వహించారు. ఈ తనిఖీల్లో రెండు వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఆనంతరం గుండుంబా తయారు చేస్తున్న ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు ఉన్నారు.

వసంత పంచమి వేడుకలు



సరస్వతి పూజలో పాల్గొన్న ఉపాధ్యాయులు



చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకుడు

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని వేదవ్యాస ఉన్నత పాఠశాలలో సోమవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పోశాల వీరమల్లు మాట్లాడుతూ.. వసంత పంచామి సందర్భంగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. 35 మందికి అర్చకుడు ముడుంబా రఘునాథచార్యులు అక్షరాభ్యాసం చేపించి, సరస్వతి పూజ నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చింతిరెడ్డి సూర్యప్రకాశ్‌రెడ్డి, పసునూటి రాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాటారం: మండల కేంద్రంలోని ఆదర్శ, వివేకనంద పాఠశాలల్లో సోమవారం ఘనంగా వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పురోహితులు వేదమంత్రోచ్చరణల మధ్య చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, ఆదర్శ, వివేకనంద కరస్పాండెంట్లు జనగామ కార్తీక్‌రావు, వలుస వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్స్ కృషిత, వందన, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ నిధులు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

గోవిందరావుపేట: డబుల్ బెడ్ రూం ఇళ్ల పెండింగ్ నిధులు మంజూరు చేయాలని మండలంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన పలువురు ఐటీడీఏ ఏటూరునాగారంలోని కార్యాలయంలో సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ కాలనీలో గత ప్రభుత్వం 2018 లో 34 ఇండ్లను మంజూరు చేయగా విడతలుగా నిధులు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. ఆరు సంవత్సరాలు కాలం గడుస్తున్న ఇళ్ల నిర్మాణ నిధులు పూర్తి స్థాయిలో విడుదల కావడం లేదన్నారు. అనేక సార్లు అధికారుల చుట్టూ తిరిగిన పెండింగ్ ఉన్న నిర్మాణ నిధులు రావడం లేదని లబ్ధిదారులు వాపోయారు. ఈ కార్యక్రమంలో ప్రేమలత, గోపిదాస్ నిర్మల, సుభద్ర, జంగిడి నాగమణి, ఏకుల వెంకయ్య, ఎస్‌కె మహబూబి, కోగిల లక్ష్మీ, మాణికల సాంబశివరావు, లక్కాకుల మమత, ఇరుగు వెంకటలక్ష్మీ, భద్ర, ఇల్లందుల సంగీత, సూజాత తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలి

- అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రద



అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్ జయప్రద

చిట్యాల: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలను క్రమ శిక్షణతో పాటు విద్యా బుద్ధులు నేర్పించి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రద అన్నారు. సోమవారం మండలంలోని వరికోల్‌పల్లి, కుమ్మరిపల్లి గ్రామాల అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూపర్‌వైజర్ జయప్రద హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ పిల్లలకు క్రమ శిక్షణతో పాటు విద్యా అందించాలని కోరారు. పిల్లల కోసం ప్రభుత్వం అన్ని రకాల ఆట వస్తువులు, బుక్స్, కూర్చోవడానికి మ్యాట్‌లు, యూనిఫామ్స్ అందజేశారని తెలిపారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించవద్దని తల్లిదండ్రులను కోరారు. అనంతరం ఎనమిది మంది పిల్లలకు సరస్వతి పూజ చేయించి అక్షరాభ్యాసంతో పాటు అన్నప్రాసన చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు హైమావతి, మోహర్ నిషా, మహిళలు, గర్భిణులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారంలోని అంగన్‌వాడీ-2లో టీచర్ మంచినీళ్ల శ్రీలత ఆధ్వర్యంలో చిన్నారులకు సోమవారం అక్షరాభ్యాసం చేశారు. వసంత పంచమి సందర్భంగా పిల్లాలకు సామూహికంగా అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

పోరాట యోధుడు కొమురం భీమ్

- తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ మైపతి అరుణ్ కుమార్

కన్నాయిగూడెం: ఆదివాసీ హక్కుల కోసం కృషి చేసిన పోరాట యోధుడు కొమురంభీమ్ అని తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ మైపతి అరుణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన కొమరం భీమ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఆలెం రాంబాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ మైపతి అరుణ్ కుమార్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధ, కాంగ్రెస్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి దనసరి సూర్య, రాష్ట్ర అటవీ సంరక్షణ చైర్మన్ పొడెం వీరన్న హాజరై కొమర భీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. పొడెం బాబు, ఆదివాసీ నాయకులు, కుల సంఘనాయకులు, వివిధ రాజకీయ నాయకులు పాల్గొన్నారు.